



నాయని కృష్ణమూర్తి

# లక్షన్నొకటో రాముని కథ

చలి ఎముకల్ని కొరికేస్తోంది.

మట్టి కుంపటిలో చితుకులు కాలిపోయి సన్నగా మొదలైన పొగ, పొగకోసమే కుంపటి రాజేసినట్లు పైకివస్తూ పక్కన కూర్చోనీకుండా చేస్తోంది.

లక్ష్మణుడు గొంతుకూర్చునే రెండడుగులు వెనక్కువేసి కళ్ళు తుడుచుకుంటూ "ఒరే రామిగా! ఆదెక్కడయినా నాలుగు చితుకులు ఏరుకురారా!" అన్నాడు పక్కన కూర్చుని కునికిపాట్లు పడుతున్న పన్నెండేళ్ళ కొడుకు రామునితో.

నిద్రమత్తు వదలని రాముడు తూలుతూ పైకిలేచి యింకా తెల్లవారని ఆ చీకట్లో కానుగ చెట్టు పక్కనున్న ముళ్ళ కంచెవైపు కదిలాడు.

లక్ష్మణునికి భయంగా వుంది. ఆ భయం లోపల కుక్కిమంచంమీద మెలికలు తిరుగుతున్న సీతాలక్ష్మి 'అమ్మో' అని కేకపెట్టినప్పుడల్లా ఎక్కువౌతోంది.

రాముడు చితుకులు ఏరుకొచ్చాడు. వాడి కిప్పుడు నిద్రమత్తులేదు. పొద్దుపుగా వాడా లన్నట్లు ఎత్తుకొచ్చిన వాటిల్లో కొన్ని మాత్రం కుంపటిలోవేసి ఊదసాగాడు.

మంట ఎక్కువయింది.

సీతాలక్ష్మి అరుపులు ఎక్కువయ్యాయి. "నన్ను చంపేయండ్రోయ్ దేవుడోయ్" ఏడుస్తోంది.

రాముడుగాని, లక్ష్మణుడుగాని సీతాలక్ష్మి అరుపులు విన్నా ఏమీ మాట్లాడలేదు. కుంపటి ముందు చలికాచుకోవడమే జీవితమన్నట్లు తదేకంగా మంటవైపు చూస్తున్నారు.

అయిదు నిమిషాలు గడిచిపోయాయి. సీతాలక్ష్మికి అరుపుల్తో శోషవచ్చినట్టుంది. కిక్కురు మనకుండా వుంది.

రాముడు చాలా సేపు ఆలోచించి "తెల్లారే లోపల పిన్నమ్మ చస్తుందంటావా నాన్నా" అన్నాడు.

లక్ష్మణుడు యథాలాపంగా తల అటూ యిటూ ఆడించి జేబులోంచి తాపీగా బీడీ ముక్కను తీసుకుని కుంపటిలో వెలిగించి ఒక గ్రుక్క తాగి "ఏమో! చెప్పడం చానాకష్టం. బతికితే బతకొచ్చు. చచ్చినా చావొచ్చు" అని ఏమనుకున్నాడో ఏమో గయ్యిమని పైకిలేచి "నాకొడకా! నీ పింతల్లి ఎప్పుడు చస్తుందా అని కాచుకూచున్నావా దొంగ ముండాకొడకా! అజ్జస్తే నీకూ నాకూ గంజినీళ్ళు పోసే దిక్కెవర్రా నాయాలా" అన్నాడు.

అని మళ్ళీ నింపాదిగా కుంపటిముందు జరిగి కూర్చున్నాడు.

రాముడు యింకా ఆలోచిస్తూనే అన్నాడు "ఎందుకోగాని అది సచ్చిపోతుందనే అనిపిస్తా వుంది. నువ్వు సెప్పవుగాని మనసులో పిన్నమ్మపోతే అర్ధరూపాయి నూకల్లో మనిద్దరికీ రోజు ఎళ్ళమూరిపోతుంది గదా అని అనుకుంటూ వుంటావు. లేకపోతే రూపాయెట్టి రాత్రి సారాయి తాగి ఉగలెయ్యకుండా ఆచారి దగ్గర యిన్ని మందు నీళ్ళు తీసుకొచ్చి దాని గొంతులో పోసుండేవాడివి."

కొడుకు తనమీద యింతటి స్వల్పమైన నిందవేసి దానికి సీతాలక్ష్మి ప్రాణాలకి ముడి పెట్టడం లక్ష్మణునికి నచ్చలేదు. "ఒరే! కుర్ర సన్నాసీ! నీకు తెలవదు. అదంటే నాకు ప్రాణంరా? ఈ క్షణంలో యమధర్మరాజు యీ కుంపటిముందుకొచ్చి ఒరే! లచ్చనా! నీ పేనం తీసకెళ్ళమంటావా? నీ పెళ్ళాం పేనం తీసుకెళ్ళమంటావా అంటే మహాప్రభో! నా పేనమే తీసుకెళ్ళు అని ధైర్యంగా చెప్పేస్తాను" అన్నాడు.

రామునికి సందేహాలు వుండనే వున్నాయి. "అసలా ఊసెత్తకుండా రూపాయి చేతిలో పెట్టి మాయమైపోతే ..."

లక్ష్మణుని కళ్ళు మెరిశాయి. ఊహలోనైనా రూపాయి చేతికి రావడం వానికి ఆనందంగానే వుంది.

"అదెట్టుకుని నువ్వు సారాయి తాగడాని కెళ్తావా? మందునీళ్ళు పోయిస్తావా?"

"... పేనాలు యిస్తానని చెప్పానుగదరా!"

"రూపాయిల్తో సమ్మంధంలేని ప్రాణాల ఊసెత్తకు. రూపాయి అయితే ఏం జేస్తావు అంట ..."

లక్ష్మణుడు మాటమార్చాడు. "తెల్లారిపోతోంది. ఆచారి నిద్ర లేసింటాడా?"

"ఆడి దగ్గరికి డబ్బుల్లేకుండా మందుకెళ్ళమంటే నేను చచ్చినా వెళ్ళను. మొగాన తుపుక్కుమని ఉంచేసినా ఉంచేయ గలఁ."


లక్ష్మణుని చేతిలో బీడీ ఎప్పుడో ఆరిపోయింది. కుంపట్లోకి దాన్ని గిరవాటేసి "సీతాలచ్మి పోతే చానా కష్టంరా!" అన్నాడు.

"మాయమ్మ సచ్చినప్పుడు కూడా నువ్విట్టాగే అన్నావు. దాని కర్మకాండ సేసీ సెయ్యకుండానే యీ యమ్మను తెచ్చి ఉంచేసు కోలా!"

లక్ష్మణుడు ఆలోచనలో పడ్డాడు.

తెల్లవారింది.

కుంపటిలో చితుకులు అయిపోయాయి. నిప్పు ఆరిపోయింది. నిండుకున్న బూడిద తెల్లారగట్ల వీచే చల్లని గాలికి పైకి తుంపరలా ఎగురుతోంది.



సీతాలక్ష్మి నిద్రలోనే చచ్చిపోయింది.

*   *   *

"పుణ్యాత్మురాలు సచ్చి సొర్గానికి చేరుకొంది." ఇరుగూ పొరుగూ సానుభూతి చూపించారు. మోకాళ్ళ మీద తలవాల్చి కూర్చున్న లక్ష్మణుడు వంచినతల పైకెత్త లేదు. పెళ్లాం చచ్చిపోతే మొగుడు అయిన వాడు ఏడ్వాలి అన్న తెలిసిన సత్యం తనకు తెలీకుండా ఎక్కడో మనసులో దాగివుండడం వల్ల అప్రయత్నంగా రెండు కన్నీటి బొట్లు విడిచి ఇంటి గుమ్మంముందు తడిక పక్కన గోడకానుకుని కూర్చుని ఏదో తెలీని దిగులు ఆవరించి వేడెక్కిన మెదడును అదుపులో తెచ్చుకోడానికి బీడీ ముట్టించిన లక్ష్మణుడు చాలా సేపటివరకు పక్కకు కదల్లేదు.

రామునికి ఏడుపులూ, పొడబొబ్బలూ అంటే చాలా అసహ్యం. అవి వింటుంటే వాడికి ఒంటిమీద తేళ్ళూ, జెర్రులూ ప్రాకి నట్లుంటుంది. లక్ష్మణుని వాలకం చూసి తన పింతల్లి హరీమందన్న నిర్ధారణకొచ్చి నిస్తేజంగా కూర్చునివున్న లక్ష్మణుని పక్కన రాతి మీదవున్న బీడీకట్టలోంచి నాలుగు బీడీలు అతి నేర్పుగా సంగ్రహించి సీతాలక్ష్మిని పూడ్చిపెట్టడానికి రెండు బారల పొద్దయినా పడుతుందని అంతవరకూ చెరువు కట్టమీద తిరిగిరావడమే మంచిదనుకుని బయలుదేరాడు.

సీతంరాజు, చంద్రిగాడు, ముసలయ్య, ద్రోణప్ప అందరూ లక్ష్మణుణ్ని తమ శాయశక్తులా ఓదార్చారు.

"నువ్విలా దిగులుపడి కూర్చుంటే లాభం లేదు. కుర్రసన్నాసి ఆ రాముడు గుండెలు బాదుకొనేస్తాడు. అయినా ఎంతమంది చావు చూళ్ళేదు నువ్వు? పుట్టింతర్వాత మనిషికి గిట్టపండా తప్పుతుందా?" అని వేదాంతం చెప్పారు.

లక్ష్మణుడు ఇలాంటి నీతుల్ని యిదివరకూ చాలామార్లు విన్నాడు. ఇప్పుడు వాడి బాధంతా చచ్చిన సీతాలక్ష్మి కోసంకాదు. ఇప్పుడా శవాన్ని ఎలా పూడ్చిపెట్టాలా అని. దానికయ్యే ఖర్చుకోసం ఏంచెయ్యాలా అని? విషమ సమస్యలా వాడి మనస్సును పీడిస్తోంది. కనీసం తనకి సంకటాన్ని తొలగించటానికైనా సీతాలక్ష్మి బ్రతికివుంటే బాగుండుననిపించింది.

బ్రతకడమంటే తెల్లారి రాముని మాటలు గుర్తుకొచ్చాయి. రాత్రి పీకలదాకా తాగడానికి

ఖర్చుపెట్టిన రూపాయి గుర్తుకొచ్చింది. ఆ రూపాయి సంపాదించుకొచ్చిన తీరు గుర్తు కొచ్చింది.

లక్ష్మి బాధ చూశ్శేక కనీసం రూపాయైనా సంపాదించి దాన్ని ఆచారికిచ్చి మందు నీళ్ళు పోయిద్దాము అని రూపాయిని సంపాదించడానికి నిజంగా కపటంలేని ఆలోచనలతోనే బయలుదేరాడు లక్ష్మణుడు.

ఇప్పుడో రూపాయి యిస్తే నాల్రోజులు కూలిచేసి పెడతాను బాబూ అని అడగగలిగిన వాళ్ళందర్నీ అడిగాడు లక్ష్మణుడు. 'తాగుబోతునాకొడకా, నీ మాట ఎవరు నమ్మారు?' అని అందరూ అన్నవాళ్ళేకాని లక్ష్మణుని మీద జాలిపడ్డ వాళ్లెవరూ లేరు.

జారిపోతున్న నిక్కరుని మాటిమాటికీ పైకి ఎగలాక్కుంటూ తండ్రి వెనకంబడి నడుస్తున్న రాముడు సలహా అందించాడు "పెదబాబుగార్ని అడక్కూడదూ?" అని. పెదబాబంటే ప్రకాశరావు. ఆ వూళ్ళోని నాలుగు వందల గడపలకూ మకుటంలేని మహారాజు. ఆ బాబు డబ్బు యిస్తాడంటే లక్ష్మణునికి నమ్మకం కుదరలేదు.

అయినా ప్రయత్నించి చూద్దామని పెదబాబు యింటి ముందుకి నడిచాడు. ఆ సమయంలో లక్ష్మణుని నవగ్రహాలూ అనుకూల స్థితిలో వున్నాయి. ఎక్కడికో బయటికి బయలుదేరి వెళ్ళబోతున్న పెదబాబు లక్ష్మణుని చూసి ఒకక్షణం ఆగాడు.

"పెళ్లాం చావుబ్రతుల్లో వుంది బాబూ! మందు పోయించాలి" ఏడుపును దిగమ్రింగుకుంటూ అన్నాడు లక్ష్మణుడు.

మారుమాట్లాడకుండా జేబులోంచి ఒక రూపాయి బిళ్ళనుతీసి దోసిలిపట్టిన లక్ష్మణుని చేతిమీదుగా క్రిందపడేటట్లు విసిరిన పెదబాబు పక్కకు తప్పుకుని వెళ్ళిపోయాడు.

లక్ష్మణుడు తెగ సంతోషపడిపోయాడు. ఎగిరిపోయే సీతాలక్ష్మి ప్రాణాలు నిలిచిపోయినట్లే సంబరపడిపోయాడు.

పరుగెత్తినంత వేగంగా ఆచారి యింటికి బయలుదేరాడు. రామునిక్కూడా సంతోషంగానే వుంది. మందుపోయిస్తే వికృతంగా ఏడ్చే సీతాలక్ష్మి ఏడుపులు ఆగిపోతాయి కదా అని వాడి ఆనందం.

అలా సదుద్దేశంతోనే బయలుదేరిన ఆ తండ్రీ కొడుకులు ఆచారి యింటికి పది గజాల దూరంలో ఆగిపోయారు.

తండ్రి ఆగటంవల్ల కొడుకు ఆగాడు.

లక్ష్మణుడు ఆగింది - రూపాయి బిళ్ళతో బొమ్మబొరుసు వెయ్యడానికి. తండ్రి అర్ధాంతరంగా రోడ్డుమీద ఆగిపోవడానికి కారణమేమిటా అని బుర్రబద్దలు కొట్టుకున్న రాముడికి సంగతి అర్ధమయింది.

రోడ్డుకు ఎడంవైపున ప్రభుత్వ సారాయి దుకాణం వుంది. కుడివేపు పదిగజాల కవతల ఆచారి యిల్లుంది.

పెళ్లాం రోగాని కన్జెప్పి తీసుకొచ్చిన రూపాయితో మందు కొట్టెయ్యడమంటే లక్ష్మణునికి బాధగానే వుంది. అదీ రాముని ముందు ఆ పని చేయాలంటే వాడి మనసు ఒప్పుకోలేదు.

ఎటూ తేల్చుకోలేని లక్ష్మణుడు రోడ్డు పక్కన ఫర్లాంగు రాతిమీద కూర్చున్నాడు. రాముడు పక్కన కంకరరాళ్ళ కుప్పమీద కూర్చొన్నాడు.

లక్ష్మణుని దైలమా రామునికి తెలుసు. "ఈడు రూపాయెట్టి మందెట్టుకెళ్ళేది లేదు. ఇట్టాగే కాస్సేపు కూచుని నన్నెక్కడికో వెళ్ళి రమ్మని పాకలోకి దూరేస్తాడు." రాముడు ఆ కార్యక్రమంకోసం ఎదురుచూస్తూన్నాడు.


"రాసిపెట్టింది రాసిపెట్టినట్లు జరుగుతుంది. ఏమంటావురా రాముడూ?" లక్ష్మణుడు అడిగాడు.

"అవును."

"ఇయ్యాళ చావాలని రాసుంటే ఆ బ్రహ్మదేవుడు దిగొచ్చినా మనిషి బతికి బట్టకట్టడు"

"నిజమే!"

"నువ్వింటికెళ్ళి దానికెట్టుందో చూడు. నేనిప్పుడే వస్తాను."




సందు మలుపు తిరిగిన రాముడు కాస్సే పోగి మళ్ళీ వెనక్కి తిరిగాడు. లక్ష్మణుడు సారాపాకలో వున్నాడు.

రాముడు పెదాలు తడుపుకున్నాడు. నెల రోజుల క్రితమెప్పుడో అయాచితంగా తన చేతి కొచ్చిన అర్ధరూపాయి బిళ్ళతో అర్ధగ్లాసు త్రాగినప్పటి రుచిని తలచుకుని పెదవుల్ని నాలుకతో తడుపుకున్నాడు.

* * *

"ఆ పని చేసుండకూడదు." ఇంకోమారు అనుకున్నాడు లక్ష్మణుడు.

"ఏరా అట్లాగే కూర్చుండిపోయావు. కాటికి తీసుకెళ్ళవా ఎమిటి?" సీతంరాజు వచ్చి పక్కన కూర్చుని బీడీముట్టిస్తూ అన్నాడు.

నిస్తేజంగా వున్న కళ్ళను పైకెత్తాడు లక్ష్మణుడు. "దమ్మిడీలేదు. ఎట్లాగా అని బుర్ర పన్జెయ్యడంలేదు."

"చావొచ్చినా బిడ్డపుట్టినా మనలాంటోళ్ళకి ఏదో ఒకటి తెగనమ్ముకోకుండా తప్పుతుందా! దేన్నైనా చూసి కార్యం జరిపించు"అన్నాడు.

"నీకు తెలవందేమిటి మావా? మట్టి బోకులు తప్ప యింట్లో ఏమున్నాయ్."

"గిత్త నమ్మేయకూడదూ? అదుండి నిన్నేం ఉద్ధరిస్తుంది?"

లక్ష్మణునికి స్వయంగా యింతవరకూ రాని యీ ఆలోచన నచ్చింది. "ఉన్నపళంగా ఎవరు కొంటారు మావా? మనమై తీసుకోమంటే పదికిస్తావా? పాతిక్కిస్తావా? అంటారు."

"ఇప్పుడు ఖర్చుకి ఎంత కావల్సి వుంటుంది?"

లక్ష్మణుడు అయోమయంగా సీతంరాజు వంక చూశాడు.

"చచ్చింది నాకు తోడబుట్టువుతో సమానం. నాకెందుకో యీ కార్యానికి నీకు సాయం పడాలనిపిస్తోంది. నువ్వు సరేనంటే యిప్పటికి సరిపడా యిచ్చేస్తాను. ఇంకో నెలనాళ్ళకు ఓ పాతికిస్తాను."

లక్ష్మణుని దగ్గర సీతంరాజు సరే అనిపించాడు.

ఈ మాటల్తో ప్రమేయమేమీలేని గిత్త లక్ష్మణుని యింటి ముందునుంచి సీతంరాజు పెరటికి మారింది.

అయిదు పదిరూపాయల నోట్లు లక్ష్మణుని బనీను జేబులో గరగరమన్నాయి.

లక్ష్మణునికి భయం వేసింది.

నిన్నటి రూపాయి గుర్తుకొచ్చింది.

అది తగలేసి తాగిన సారాయి గుర్తుకొచ్చింది.

లక్ష్మణుడు తనకు తెలిసిన లెక్కల జ్ఞానంతో యాభై రూపాయలకు మొత్తం ఎంత పరిమాణం కలిగిన సారాయి వస్తుందో అని ఆలోచించాడు.

లక్ష్మణునికి మళ్ళీ భయం వేసింది.

చెరువుగట్టుమీదినుంచి రాముణ్ణి పిలిపించి డబ్బు ఇచ్చి అంగడినుండి కావలసిన సరుకులు తీసుకురమ్మన్నాడు.

లక్ష్మణునిలో భయం అంతరించి హృదయం తేలికపడింది.

రామునిలో భయం మొదలయింది.

*　　*　　*

రాముడు వీధిరో హుందాగా నడుస్తున్నాడు.

మహారాజులా గంభీరంగా అడుగులు వేస్తున్నాడు.

ఎదురొస్తున్న పెదవాటు వాడి కంట్లో పడలేదు.

సారాపాక ముందు కొచ్చేసరికి నిన్నటి లక్ష్మణునిలా రాముడుకూడా అప్రయత్నంగా ఆగిపోయాడు.

వాడి పెదవులమీదికి సన్నటి చిరునవ్వు పొడుచుకొచ్చింది. నిన్న లక్ష్మణుడు కూర్చున్న ఫర్లాంగు రాతిమీదే కూర్చుని సారాపాకలోకి నిర్నిమేషంగా చూడసాగాడు.

లక్ష్మణుడు చెప్పిన కర్మ సిద్ధాంతం గుర్తొచ్చింది.

రాసిపెట్టింది రాసిపెట్టినట్లు జరుగుతుందని నిన్నయితే ఒప్పుకున్నాడు గానీ యీ రోజు మళ్ళీ వాడికి అదే అనుమానమొచ్చింది.

అలా అనుమానం రావడం బహుశా యీ ఫర్లాంగు రాతిమీద కూర్చోవడంవల్ల జరుగుతోందేమోనని పక్కన కంకరరాళ్ళ కుప్ప మీద తన తండ్రిని ఊహించుకుని "రాసిపెట్టింది రాసిపెట్టినట్లు జరుగుతుంది. అవును కదా లక్ష్మణా?" అన్నాడు.

లక్ష్మణుడు "ఔను" అని సమాధానమిచ్చినట్లు ఊహించుకున్నాడు రాముడు.

"పిచ్చి ముండాకొడుకా!" అని రాముడు కంకరరాళ్ళ కుప్పమీద ఊహించుకున్న లక్ష్మణునిమీద ఒకమారు, సారాయిపాకవైపు తిరిగి అటువైపు ఒకమారు తుపుక్కుమని ఉమ్మి చేతులు కట్టుకుని తల ఎగరవేస్తూ ముందుకు నడిచాడు.

రామునిలో యిప్పుడు భయంలేదు. నిన్న మా నాయననాకొడుకు చేసిన తప్పును నేను మళ్ళీ చేయడానికి అవకాశమున్నా నేను చేయలేదు. నేను ఆడికంటే చాలా మంచోణ్ణి అనుకుంటూ ముందుకు నడిచాడు.

పూర్తిగా ముందుకు నడవలేకపోయాడు రాముడు.

వద్దనుకుంటూనే పక్కదోవకు తిరిగాడు. కారణం ఆ దోవలో ముందు కామేశ్వరి వయ్యారంగా నడుస్తూపోతోంది.

"ఒసేయ్" గట్టిగా పిలవలేక నెమ్మదిగానే పిలిచాడు రాముడు.

ఆ వూళ్ళో మీసం వచ్చి నిక్కరు సరిగ్గా కట్టడం చేతనైన మగాళ్ళనుంచి అరవయ్యేళ్లు వచ్చినా కక్కుర్తి చావని వాళ్ళవరకూ అందరికీ కామేశ్వరి యెవరో తెలుసు.

అద్దంముక్కలో తనకు అందమైన మీసం అప్పుడప్పుడే రావడం పసికట్టిన రాముడు ఒకరోజు మామిడితోపు దగ్గర ఎవరూలేకుండా చూసి కామేశ్వరిని నిలేశాడు.

"పక్కకు జరగవయ్యా!" అంది కామేశ్వరి పెడరసంగా.

"ఊహూఁ!" కళ్ళలోనే కామేశ్వరిని తినేసేలా చూశాడు రాముడు. మొండిధైర్యంతో అలా తెగించాడుగాని రాముని గుండె నిముషానికి లక్షమార్లన్నంత వేగంగా కొట్టుకుంటోంది.

"ఎంతవుద్దో తెలుసా? అయిదు రూపాయలు—అదే యిదే కామేశ్వరి పట్నం వెళ్తే పదిరూపాయలు. ఏమయ్యో? అయిదు రూపాయలు పదిరూపాయిలు అంటే ఏంటో నీకర్థమయిందా? ఇప్పుడు జరుగు పక్కకు. తొందరగా పోవాలి."

నీరసించిన రాముడు పక్కకు జరిగాడు.

"జేబులో అణాకానీ లేని నాయాళ్ళంతా పయిట పట్టుకొని నిలసేవాళ్ళే!" కామేశ్వరి

గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

రాముని శరీరం ఉడికిపోయింది.

ఇప్పుడు కామేశ్వరిని చూడగానే రామునికి ఆ రోజుటి సంగతి మళ్ళీ గుర్తుకొచ్చింది. శరీరం మళ్ళీ ఉడికింది.

గొంతు హెచ్చించి మళ్ళీ పిలిచాడు రాముడు 'ఒసేయ్' అని.

కామేశ్వరి ఆగింది.

రాముడు షర్టు చిరుగునూ కాలర్‌నూ సర్దుకుని "ఏంటి? ఆరోజు ఏంటన్నావూ?" అన్నాడు ఉపోద్ఘాతం ఏమీ లేకుండానే.

కామేశ్వరి బిత్తరపోయింది. శివమెత్తినట్టున్న రాముడు నడిరోడ్డులో ఏం అఘాయిత్యం చేస్తాడో ఏమో అనుకుని "ఏంటయ్యా మంచి వూపులో వున్నట్టున్నావే!" అంది.

"నీ ఎదవ్వేషాలు తర్వాతగాని , ఆ రోజు ఏమన్నావు? ఎంతవుద్దన్నావు?" అన్నాడు.

కామేశ్వరి వయ్యారాలు పోయింది. "దేనికెంతేవిఁటి?" నంగిలా అంది.

"పట్నంకెళ్తే పది రూపాయలా? ఒసే కామేసిరీ! ఈ రాముడంటే అల్లాటప్పా ఓడని కదూ నీ ఉద్దేశం? అలా ఎప్పుడూ అనుకోమాక. మనిసన్న తర్వాత డబ్బులుండేటయమూ వుంటుంది లేని టయమూ వుంటుంది. అర్థం చేసుకోవాల. జేబులో అణాకానీ లేని నా యాళ్ళంతా పయిటపట్టుకుని నిలేసే నాయాళ్ళే అన్నావు కదూ? ఇదిగో యిటు చూడు. కనిపిస్తున్నాయా? ఏంటివి? పది రూపాయలు. ఎన్ని? అయిదు. మొత్తం ఎన్ని రూపాయలు? యాభై రూపాయిలు. కామేశ్వరీ? ఇలాంటి డబ్బు రాముడెన్నో మార్లు కళ్ళజూశాడే!"

"అయితే యిప్పుడేటంటావు? ఇక్కడికిక్కడ "ఆగిపోయింది.

రాముడు తుపుక్కున ఉమ్మేశాడు. గబగబా తన చేతిలోని నోట్లను కామేశ్వరి చేతిలో కుక్కి "వాడూ డబ్బుకోసం గడ్డితినే నీలాంటి పెళ్లాం, మందులుకోసం తెచ్చిన్రూపాయెట్టి మందు కొట్టేసే ఆ లక్ష్మన్నులాంటోడు కాదే యీ రాముడు. ఈడు నికార్సయినోడూ" అని రివ్వున వెనక్కుతిరిగి గబగబా నడవసాగాడు.

క్షణంసేపు మతిభ్రమించినట్లయిన కామేశ్వరి కిసుక్కుమని ఓ నవ్వు నవ్వుకుని ముందుకెళ్ళిపోయింది.

రోడ్డుమీది కొచ్చిన రాముడు ఫర్లాంగు రాతిమీద మళ్ళీ కూర్చున్నాడు.

ఇప్పుడు మళ్ళీ వాడికి ఎటెళ్ళాలో దిక్కు తోచటంలేదు.

కాస్సేపు జుట్టుపీక్కుని కంకర రాళ్ళమీద మళ్ళీ లక్ష్మణున్ని ఊహించుకుని "లక్ష్మణా! నేన్జేసింది రైటేనంటావా?" అన్నాడు.

"ఓరి నా కొడకా! ఆ యాభై రూపాయలూ నువ్వా లంజకిచ్చేస్తే మీ పింతల్లిని పూడ్చిపెట్టేది ఎట్లాగురా?" అన్నాడు ఊహాలక్ష్మణుడు.

రాముడు మళ్ళీ జుట్టు పీక్కుని కాండ్రించి ఉమ్మడానికి ఎవరూ తోచకపోవడంతో తన నీడ మీద తానే ఉమ్మకుని తిరిగి చూడకుండా పట్నానికి బయలుదేరి వెళ్ళిపోయాడు.

* * *

లక్ష్మణునికి ఆశ్చర్యంగా వుంది.

ఇంట్లో పీనుగను పెట్టుకుని రాముడు డబ్బెత్తుకుని పారిపోయాడంటే కాదన్న పాపాత్ముడు లేడు. తమంతకు తామే ఒకటీ అరా చందాలు పోగుచేసి జరపాల్సిన కర్మకాండనంతా ఏ లోటూ లేకుండా జరిపించివేశారు.

* * *

నాల్రోజులపాటు తిండీ తిప్పలు లేకుండా తిరిగిన రాముడు మళ్ళీ యింటికి వచ్చాడు. లక్ష్మణుడేమీ మాట్లాడలేదు. బిక్కుబిక్కుమనుకుంటూ రాముడు అప్పుడో మాట యిప్పుడో మాటగా రెండు రోజుల్లో తాను డబ్బును ఏమేంచేసిందీ పూర్తిగా లక్ష్మణునికి చెప్పేశాడు.

సంగతి పూర్తిగా విన్న తర్వాత లక్ష్మణుడు అనుకున్నాడు. "అసలు డబ్బెట్టుకుని నేను పారిపోయున్నా కర్మకాండ జరిగిపోయుండేది. పైగా యీ సన్నాసి నాయాల్లా కాకుండా పీకల్దాకా తాగేసి కామేశ్వరికి ఎంతిచ్చినా యిచ్చిందానికి పదింతలుగా రాబట్టుకొనివుండేవాణ్ణి." □